
సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



ప్రణాళికతో చదువు..విజయం సులువు

పరీక్షలు ఏవైనా ప్రణాళికే మార్గమని త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒత్తిడిని వీడి రాస్తే విజయం దాసోహం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. -IIలో



గ్రూప్‌-2 పరీక్షకు పటిష్ట బందోబస్తు

జిల్లాలో ఆదివారం జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్‌-2, స్క్రీనింగ్ టెస్ట్ రాతత పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.4/25.7

జిల్లాలో శనివారం 25.7 - 37.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఆగ్రహజ్వాలలు!

- చంద్రబాబు ఫొటోను చెప్పులతో కొట్టిన రమేష్‌రెడ్డి వర్గీయులు
- టీడీపీ జెండాలు కాల్చి నిరసన.. మూకుమ్మడి రాజీనామాలు
- కడప అభ్యర్థిగా మాధవిరెడ్డి.. రగిలిపోతున్న అమీర్‌బాబు, ఉమాదేవి

సాక్షి ప్రతినిధి, కడప: అభ్యర్థుల ప్రకటనతో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా తెలుగుదేశం పార్టీలో ఆగ్రహజ్వాలలు రగులుతున్నాయి. అధినేత చంద్రబాబు ఫొటోను చెప్పులతో కొట్టారు. పార్టీ జెండాలకు నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడ్డారు. విధేయతను పరిగణలోకి తీసుకోకుండా అభ్యర్థులను ఎంపిక చేశారని మండిపడ్డారు. ఇదిలా ఉంటే కొద్ది సీట్లు మాత్రమే ప్రకటించి, తక్కినవి పెండింగ్ పెట్టడంతో ఆయా సెగ్మెంట్లలో తెలుగుతమ్ముళ్ల మధ్య హైటెన్షన్ కొనసాగుతోంది.

• రాయచోటి టీడీపీ అభ్యర్థిగా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ప్రకటించారు. చంద్రబాబు శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యేలు రమేష్‌కుమార్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డిలకు ఫోన్ చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆదేశించారు. చంద్రబాబు నిర్ణయానికి శుక్రవారం రాత్రే ప్రతిఘటన ప్రారంభమైంది. టీడీపీ జెండాలకు నిప్పు పెట్టి అర్ధరాత్రి వరకు నిరసన పాటించారు. శనివారం అభ్యర్థి ప్రకటనతో మరింత ఆజ్యం పోసినట్లయింది. ఒక్కమారుగా రమేష్‌కుమార్‌రెడ్డి వర్గీయులు భగ్గుమన్నారు. చంద్రబాబు ఫొటోను చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జిలు, 44మంది యూనిట్ ఇన్‌చార్జిలు, 286 మంది బూత్ కమిటీ సభ్యులు, ఆరుగురు మండలశాఖ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, 9 మంది సర్పంచ్‌లు రాజీనామాలు చేయనున్నట్లు ప్రకటించారు. ఆ విషయాన్ని మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కలాడీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ప్రకటించారు. 25ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ, కష్టకాలంలో వెంట నడిచినా నిరుపయోగమే అయిందని వారు వెల్లడించారు. కాగా మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆశలకు సైతం బ్రేకులు పడ్డాయి. అధిష్టానం నిర్ణయం కలవరపాటుకు గురిచేసినా మౌనం వహిస్తున్నారు.

కడప టీడీపీ అభ్యర్థిగా మాధవీరెడ్డి....

ఆరు నెలలు క్రితం వరకు అమె రాజకీయాలకు దూరం. సొంత కాంట్రాక్టు సంస్థ ఆర్కే ఇన్‌ఫ్రా పర్యవేక్షణలో ఉన్నారు. అనూహ్యంగా రాజకీయ అరంగ్రేటం చేసి కడప అసెంబ్లీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. అప్పటి వరకు అభ్యర్థిగా ఊరిస్తూ వచ్చిన ఉమాదేవి కుటుంబానికి చంద్రబాబు అండ్‌కో షాక్ ఇచ్చింది. రెండేళ్ల కిందట ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి కుటుంబానికి టీడీపీ అధిష్టానం అభయం ఇవ్వడంతో తెరవెనుక ఎన్నికల గ్రౌండ్ దాదాపు పూర్తి చేశారు. అంతలోనే మాధవీరెడ్డి ప్రత్యక్షం కావడంతో డీలా పడ్డారు. కాగా నారా లోకేష్ మీ పని మీరు చేసుకోండి, ఉమాదేవి అభ్యర్థిత్వం ఖరారు చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాబట్టే మాధవీరెడ్డిని ఇన్‌చార్జిగా ప్రకటించినా పోటీగా కార్యక్రమాలు నిర్వహించారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కార్పొరేటర్ ఉమాదేవి, మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు, దుర్గాప్రసాద్ జట్టుగా ఏర్పడి పోటీ కార్యక్రమాలను కొనసాగించారు. ఉప్పు-నిప్పులా ఉన్న ఈ రెండు వర్గాలను ఏకతాటిపైకి తీసుకురాకుండానే మాధవీరెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేయడంపై వైరిపక్షం తీవ్ర ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేస్తోంది.



రాయచోటి: తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పత్రాలను చూపుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తొలి జాబితాలో పుత్తాకు మొండిచేయి....

కమలాపురం టీడీపీ ఇన్‌చార్జిగా పుత్తానరసింహారెడ్డి పదహారేళ్లుగా ఉన్నారు.మూడు మార్లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మరోసారి ఎన్నికల్లో తలపడాలని భావించి పార్టీ కార్యక్రమాలను చురుగ్గా కొనసాగిస్తున్నారు. కమలాపురం కేంద్రంగా రా...కదిలిరా..కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించినా, ఆ సందర్భంగా చంద్రబాబు పుత్తా పేరు ఉచ్చరించకపోవడంతో తెలుగుతమ్ముళ్లు డైలమాలో పడ్డారు. ఈలోగా పుత్తా అభిప్రాయంతో నిమిత్తం లేకుండా మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డిని టీడీపీలో చేర్చుకున్నారు. తర్వాత ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌లో వీరశివా అభ్యర్థిత్వంపై సర్వే నిర్వహించారు. ఇలాంటి తరుణంలో తొలిజాబితాలో పుత్తాకు టీడీపీ అధిష్టానం మొండిచేయి చూపడంతో అక్కడి శ్రేణుల్లో టెన్షన్ కొనసాగుతోంది.

▸▸ పెండింగ్ స్థానాల్లో హై టెన్షన్

పులివెందుల, మైదుకూరు టీడీపీ అభ్యర్థులుగా మారెడ్డి రవీంద్రనాథరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్‌లను ఖరారు చేశారు. ఏక నాయకత్వంలో టికెట్ ఆశిస్తుండడంతో అక్కడ ఖరారు చేశారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలాంటి పరిస్థితే ఉన్న జమ్మలమడుగు స్థానాన్ని పెండింగ్ పెట్టారు. అక్కడి ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ సీటుపై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డికి కన్నుపడింది. బీజేపీ పొత్తు పొడిస్తే ఆ సీటు కోరాలనే నిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. తనకున్న రాజకీయ సంబంధాలతో తాత్కాలిక బ్రేక్ వేయించి, అబ్బాయి భూపేష్‌కు బాబాయ్ అది మోకాలొడ్డారని విశ్లేషకులు భావిస్తున్నారు.బద్వేలులోనూ అలాంటి పరిస్థితి ఏర్పడింది. ఇరిగేషన్‌శాఖలో డీఈగా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి తెరపైకి వచ్చిన రోశన్న డీలా పడ్డారు. టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి రోశన్న అభ్యర్థిత్వం ఖరారు చేయాలని పట్టుదలతో ఉన్నా అభ్యర్థుల తాజా జాబితాలో పేరు లేకపోయింది.

▸▸ ప్రొద్దుటూరులో కొనసాగుతున్న ఉత్కంఠ...

ప్రొద్దుటూరు టీడీపీ టికెట్‌ను నలుగురు ఆశిస్తున్నారు. ఎవరికి వారు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి చంద్రబాబు ఆశీస్సులు లభించగా, ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి నారా లోకేష్ అభయమిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడు అభ్యర్థిత్వం కోసం సోదరుడు సీఎం రమేష్‌నాయుడు మంత్రాంగం కొనసాగిస్తున్నారు. ఈపరిస్థితుల్లో ప్రొద్దుటూరు స్థానం తొలి జాబితాలో లేదు. ఎవరూ లేనప్పుడు, సీనియర్లు ముఖం చాటేసిన సమయంలో పార్టీ జెండాను తన భుజస్కందాలపై వేసుకున్నానని ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రకటిస్తూ తన అభ్యర్థిత్వంపై ధీమా వ్యక్తం చేశారు. కాగా ఎక్కడికక్కడ ఆశావహుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతుండటం గమనార్హం.

▸▸ మాధవిరెడ్డికి టికెట్ కేటాయింపు తప్పడునిర్ణయం

కడప రూరల్: కడప నియోజకవర్గ టికెట్ మాధవిరెడ్డికి ఇవ్వడం పార్టీ తప్పుడు నిర్ణయం తీసుకుందని కడప నియోజకవర్గ టీడీపీ మాజీ ఇనాచార్జి వీఎస్ అమీర్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, దుర్గాప్రసాద్, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు మన్మోహన్ రెడ్డిలు అభిప్రాయపడ్డారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి వెంట నడిచిన వారిని విస్మరించి మాధవిరెడ్డికి టికెట్ కట్టబెట్టడంతో కార్యకర్తలు నిరాశగా ఉన్నారని వారు తెలిపారు.



సమావేశమైన దుర్గాప్రసాద్, అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి

టీడీపీకి మూకుమ్మడి రాజీనామాలు

శంకర్‌కు టికెట్ ఇవ్వాలని బి.కొత్తకోటలో రాస్తారోకో

బి.కొత్తకోట: తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా కొత్తగా పార్టీలో చేరిన జయచంద్రారెడ్డిని ప్రకటించారు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కు టికెట్ ఇవ్వలేదు.ఇందుకు నిరసనగా శనివారం సాయంత్రం ఆ పార్టీ నియోజకవర్గ నేతలు రాజీనామాలు ప్రకటించి సంతకాలు చేసారు. బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఆరు మండలాలకు చెందిన కన్వీనర్లు, జిల్లా, రాష్ట్ర పదవులు కలిగిన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన నాయకులు నిన్నటి వరకు టికెట్ శంకర్‌కే ఇస్తున్నామని నమ్మించి మోసం చేశారని అన్నారు. పార్టీకోసం శ్రమించిన శంకర్‌కు జరిగిన అవమానాన్ని సరిదిద్ది టికెట్ అయనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబును కలిసి పరిస్థితులను వివరిస్తామని నాయకులు పేర్కొన్నారు. తర్వాత పార్టీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి శంకర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. అక్కడినుంచి ప్రదర్శనగా పీటీఎం రోడ్డుపైకి చేరుకుని బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. శంకర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. శంకర్‌కు మద్దతుగా పార్టీకి, పదవులకు రాజీనామాలు చేశారు. వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథరెడ్డి, పోల్‌మేనేజ్‌మెంట్ కన్వీనర్ కుడుం శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ ఈశ్వరప్ప, ఎస్సీసెల్ రాష్ట్రకార్యదర్శి తమక శ్రీనివాసులు, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, మండలాల కన్వీనర్లు అనంద్‌రెడ్డి, వైజి.సురేంద్ర, నారాయణస్వామిరెడ్డి, జిట్టా వెంకటరమణ, రెడ్డెప్పరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బంగారు వెంకటరమణ, క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, వివిధ విభాగాల్లో పదవులు కలిగిన నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రాజీనామాలు చేసిన వారిలో ఉన్నారు. బి.కొత్తకోటలోని పార్టీ కార్యాలయం చేరుకున్న నాయకులు, కార్యకర్తలు కొందరు ఫ్లెక్సీలు తొలగిస్తూ కేకలు వేయడం, కార్యాలయంలోకి వెళ్లి పార్టీ జెండాలను విసిరేశారు.దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.



టీడీపీ ఫ్లెక్సీలను చించేస్తున్న కార్యకర్తలు

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

పెద్దమండ్యం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, తంబళ్లపల్లె టీడీపీ టికెట్ దక్కించుకున్న జయచంద్రారెడ్డిల దిష్టిబొమ్మలను పెద్దమండ్యం బస్టాండులో శనివారం మాజీ ఎమ్మెల్యే జి. శంకర్ వర్గీయులు దహనం చేశారు. టీడీపీ నాయకులు వి. రఫీ అనుచరులతో వచ్చి చంద్రబాబు, జయచంద్రారెడ్డిల దిష్టిబొమ్మలపై వారి చిత్రపటాలను ఉంచి దహనం చేశారు. అలాగే బస్టాండు కూడలికి సమీపంలో ఉన్న మాజీ టిడిపి మండల అధ్యక్షుడు శిద్దవరం ప్రసాద్ కారు అద్దాన్ని పగలగొట్టారు. ఈ కారులో జయచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు తిరుగుతున్నారనే కారణంతో కారు అద్దాన్ని పగల గొట్టినట్లు తెలుస్తోంది. కాగా కారు అద్దం పగల గొట్టడంపై టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు తెలియడంతో జయచంద్రారెడ్డి అనుచరులు వారించారు. కారు అద్దం వేయిస్తామని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

న్యూస్‌రీల్

నేడు పీఆర్ ఉద్యోగ సంఘ ఎన్నికలు

కడప సెవెన్‌రోడ్స్: పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లాశాఖ ఎన్నికలు ఆదివారం ఉదయం 9.00 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, బసిరెడ్డిలు తెలిపారు. జిల్లా యూనిట్‌కు ఎన్నికలు జరిపేందుకు 12 సమితిల యూనిట్లకు కొత్త సభ్యులు, పరిషత్ యూనిట్ సభ్యులు హాజరై కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 25వ తేది ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పని చేస్తాయని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

28న మెగా జాబ్‌మేళా

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 28వ తేదీ బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఉమ్మడి జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులు పాల్గొనాలని కోరారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ విద్యార్థులు ధృవీకరణ పత్రాలతో కళాశాలలో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 93472 56400, 9490560441 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు పూర్తి

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను మరోసారి తనిఖీ చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రూప్-2 పరీక్ష ఏర్పాట్లు, రీ సర్వే మూడోదశ, ఇనాం, అసైన్డ్ భూములు, ఇంటి పట్టాలు నమోదు, గృహ నిర్మాణం, కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీరు, ప్రాధాన్యత భవనాలు తదితర అంశాలపై సీఎస్‌కు వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

• ఎన్నికల విధుల్లో పాల్గొనే రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలను ర్యాండమైజేషన్ ప్రకారం ఆయా నియోజకవర్గాలు, మండలాల పోలింగ్ కేంద్రాలకు లోకేషన్ల వారీగా విధులను కేటాయించేందుకు ట్రయల్ రన్ కలెక్టర్ నిర్వహించారు. ఈసీఐ నిబంధనల మేరకు కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన మొదటి, రెండవ దశల ట్రైల్ రన్‌లో జేసీ గణేష్‌కుమార్, కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్వోలు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి సతీష్‌రెడ్డికి ఆహ్వానం

సీఎం ఆదేశాల మేరకు సతీష్‌ను కలిసిన నేతలు

వేంపల్లె: శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డిని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జిల్లా రీజినల్ కొఆర్డినేటర్ సురేష్‌బాబు కలిసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. శనివారం వేంపల్లెలోని సతీష్‌రెడ్డి స్వగృహంలో ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సతీష్ కుమార్ రెడ్డిని కలిసినట్లు చెప్పారు. 30 సంవత్సరాలుగా టీడీపీలో ఉంటూ వైఎస్ కుటుంబంతో సతీష్ రెడ్డి పోరాడిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు.

ఆయనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీలోకి ఆహ్వానించమని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేసిన పట్టుదలను గుర్తించి పార్టీలోకి వస్తే బాగుంటుందని చెప్పారు. సతీష్ రెడ్డితో చర్చించగా మూడు రోజుల్లో కార్యకర్తలతో చర్చించి తన నిర్ణయం తీసుకొంటానని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం సముచిత కల్పిస్తారని సతీష్‌కు భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ చిర స్థాయిలో నిలిచాయని చెప్పారు.ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రంలో సుపరి పాలన అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గిరిధర్ రెడ్డి, సతీష్ రెడ్డి అనుచరులు పాల్గొన్నారు.



సతీష్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సురేష్‌బాబు తదితరులు

క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత





వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, బాస్కెట్‌బాల్ ఆడుతున్న ఉప ముఖ్యమంత్రి

• ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్ బాషా పేర్కొన్నారు. శనివారం కడపలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో రూ.1.17 కోట్ల పైకా-నగరపాలక సంస్థ నిధులతో ఆధునికీకరించిన వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ కోర్టును, రూ.38.74 లక్షలతో నూతనంగా నిర్మించిన బాస్కెట్‌బాల్ కోర్టుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డితో కలిసి వాటిని ప్రారంభించి, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న దృఢసంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శనంలో క్లీన్ అండ్ గ్రీన్ కడపగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అదే విధంగా క్రీడల కేంద్రంగా కడపను తీర్చిదిద్దడంలో భాగంగా ఇప్పటికే పనులను ప్రారంభించామన్నారు. రూ.13 కోట్లతో ఇండోర్, అవుట్‌డోర్‌ల ఆధునికీకరణ, నిర్మాణపనులకు శ్రీకారం చుట్టామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కడపలో రాజారెడ్డి స్టేడియం, క్రీడాపాఠశాల, ఇండోర్ స్టేడియం ఏర్పాటయ్యాయన్నారు. తాజాగా వాటిన్నంటినీ మరింత ఆధునీకరించేందుకు పనులను చేపట్టామన్నారు. జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యంతో పాటు క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. శాప్ బోర్డు డైరెక్టర్ ఎం. డానియల్ ప్రదీప్‌కుమార్ మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో రాణించిన క్రీడాకారులను వారు అభినందించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మున్సిపల్ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, డీఈ కరీముల్లా, కార్పొరేటర్లు హరూన్‌బాబు, మల్లికార్జున, అజ్మతుల్లాఖాన్, నాగేంద్రప్రసాద్, రాజశేఖరరెడ్డి, వైఎస్‌ఆర్‌సీఎం తూర్పు క్లస్టర్ అధ్యక్షుడు తోటకృష్ణ, డివిజన్ ఇన్‌చార్జిలు రెడ్డిప్రసాద్, త్యాగ రా జు, భాస్కర్ వర్మ, రామచంద్రయ్య, నాయకులు శివకేశవ, జయచంద్రారెడ్డి, సత్య, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై నిఘా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని 124 ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. శనివారం కడపలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్ముతున్నారని, ఎక్కడ కూడా తమ సిబ్బంది అధిక ధరలకు మద్యం అమ్మడం లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం రవాణాను అరికడతామన్నారు.

వైవీయూ పరిశోధకుడికి రూ.27లక్షల ఫెలోషిప్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ పూర్వ విద్యార్థి డాక్టర్ ఇ. బాలాజీకి రూ.27 లక్షల ఫెలోషిప్ మంజూరైంది. భారత ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డ్ నేషనల్ పోస్టు డాక్టరల్ ఫెలోషిప్ కింద ఈయన డీఎస్‌టీ పరిశోధన కోసం రూ.27 లక్షలు ఫెలోషిప్ మంజూరు చేశారు. వైవీయూ జియాలజీశాఖ ఆచార్యులు డా. వంగల సునీత మార్గదర్శనంలో డాక్టర్ ఇ. బాలాజీ 'పట్టణ వాటర్ షెడ్ నిర్వహణ' అన్న అంశంపై రెండు సంవత్సరాల పాటు పరిశోధన చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు.



బాలాజీని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు

అందరికీ అందుబాటులో ఇసుక... పారదర్శక విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ధరకే నాణ్యమైన ఇసుక...



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి

YSR జిల్లాలో నియోజకవర్గాల వారీగా రీజనబుల్ రవాణా ఛార్జీలతో కలిపి టన్నుకు ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక ధరల వివరాలు ప్రక్కన ప్రకటిస్తున్నాం. జిల్లాలో ఇంతకన్నా ఎక్కువ ధరకు ఎవరైనా మీమీ నియోజకవర్గాల్లో అమ్మితే SEB ఫోన్ నెంబర్ - 86888 30051 కు ఫిర్యాదు చేయండి.. ఎవరైనా ఇంతకన్నా ఎక్కువ ధరకు అమ్మితే 2 లక్షల వరకు జరిమానా, 2 ఏళ్ల జైలు శిక్ష.. రెండూ విధిస్తారు. అన్ని రీచ్‌ల వద్ద ఇసుక గరిష్ట అమ్మకపు ధర టన్నుకు రూ. 475/- మాత్రమే...

★ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మరింత తక్కువ ధరకు అందేలా అన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి వచ్చాయి..
★ ఇసుక బ్లాక్ మార్కెట్ ట్రాన్స్ పోర్టర్ల సిండికేట్ లకు చెక్ పెడుతూ మీకు కావలసిన ఇసుక క్వాంటిటీని నేరుగా ఇసుక రీచ్ వద్ద తగినంత అమౌంట్ చెల్లించి పొందగలరు.
★ అందరికీ అందుబాటు ధరలో నాణ్యమైన ఇసుక పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర	నియోజకవర్గం పేరు	టన్ను ఇసుక ధర
కడప	రూ. 775/-	మైదుకూరు	రూ. 920/-
కమలాపురం	రూ. 615/-	పులివెందుల	రూ. 760/-
ప్రొద్దుటూరు	రూ. 690/-	జమ్మలమడుగు	రూ. 625/-
బద్వేల్	రూ.1,105/-		

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గనులు మరియు భూగర్భ శాఖ

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14500

వినియోగదారుల కోసం హెల్ప్ లైన్ నెంబర్ 93981 89034

శ్రీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ పర్యావరణం, సైన్స్ & టెక్నాలజీ, గనులు, భూగర్భ వనరుల శాఖామాత్యులు

25-02-2024

టిఫిన్ సెంటర్ నిర్వాహకుడి
ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కొత్తపల్లెకు చెందిన వెంకటరమణ శుక్రవారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో 22న రాత్రి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తుండగా.. గస్తీకి వెళ్లిన పోలీసులు దుకాణం మూసేయాలంటూ తనను దుర్భాషలాడినట్లు తెలిపాడు. మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కొట్టినట్లు అతను ఆరోపించాడు. దీంతో మనస్తాపం చెందిన వెంకటరమణ ఆత్మహత్యాయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై రూరల్ సీఐ రమణారెడ్డిని వివరణ కోరగా.. వెంకటరమణ ప్రతి రోజూ రాత్రి 10 గంటల తర్వాత కూడా షాపు మూయకుండా వ్యాపారం చేసుకుంటున్నాడని తెలిపారు. పోలీసులు చాలా సార్లు చెప్పినా అతను రాత్రి 10 గంటల తర్వాత టిఫిన్ సెంటర్ మూయడం లేదన్నారు. ఈ క్రమంలో రాత్రి గస్తీలో భాగంగా అక్కడికి వెళ్లిన పోలీసులు షాపు మూయమని చెప్పడంతో అతను పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని సీఐ చెప్పారు. వెంకటరమణను పోలీసులు ఎవరూ కొట్టలేదని సీఐ తెలిపారు.

శ్రీ కోదండరామస్వామి దేవాలయం
భావన్నారాయణనగర్ (గ్రా), గోపవరం(మం), కడప జిల్లా
e-Procurement Tender
NIT NO.P/COE/266/2024-92. Dt. 22.02.2024
దేవాలయ పునర్నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు క్రింది వెబ్‌సైట్‌ను చూడగలరు.
https://tendereprocurement.gov.in
ఇట్లు. ధర్మకర్త పుత్త శ్రీరాములు,
సెల్ : 9440873109

మద్యం సీసాలు స్వాధీనం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలో శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాశి వెంకట సురేష్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద 30 మద్యం బాటిళ్ల చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్‌వి.కొండారెడ్డి తెలిపారు.

మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు
ప్రిన్సిపాల్ ఆఫీస్ ప్రభుత్వ వైద్యకళాశాల, కడప
తారీఖు : 23.02.2024 స్థలము :కడప
పత్రికా వార్త
మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్యకళాశాల కడప వారు ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ మరియు కాన్సర్ కేర్ సెంటర్ కడప ఔట్ సోర్సింగ్ పద్ధతిన జరుగు నియామకాలకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టును కడప జిల్లా ప్రభుత్వ వెబ్‌సైట్ అయిన https://kadapa.ap.gov.in నందు 23.02.2024 వ తారిఖున ఉంచడం జరిగింది కావున అభ్యర్థులు ఈ లిస్టును పరిశీలించిమీ అభ్యంతరములు మరియు గ్రీవెన్స్‌లను స్వయముగా ఆఫీసు పని సమయము నందు అనగా 10.30 నుండి సాయంత్రం 05.00 వరకు తేది 26.02.2024 నుండి తేది 28.02.2024 వరకు ఏ.డి.ఎం.ఇ./ ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్యకళాశాల, కడప నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నందు మాత్రమే సమర్పించవలెను మరియు పోస్టు ద్వార పంపబడిన అభ్యంతరములు గ్రీవెన్స్‌లను స్వీకరించబడవు అని ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, కడప వారు తెలియచేయడమైనది. గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు గ్రీవెన్స్‌లను మరియు పోస్టు ద్వార వచ్చునటువంటి అభ్యంతరములు గ్రీవెన్స్‌లను స్వీకరించబడవు అని తెలియజేయడమైనది.
ఇట్లు: ఏ.డి.ఎం.ఇ / ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్యకళాశాల, కడప

ప్రణాళికతో చదువు..
విజయం సులువు

పరీక్షలు ఏవైనా ప్రణాళికే మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. త్వరలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలంటేనే విద్యార్థుల్లో భయం సహజం. ఆందోళన వీడి, స్వేచ్ఛగా ఆలోచించి రాస్తేనే విజయం దాసోహం అవుతుంది. ఇందుకు విద్యార్థులను సన్నద్ధం చేయడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కత్తి మీద సామే. ఈ కొన్ని రోజులు ఒత్తిడికి దూరంగా ఉండి.. ప్రణాళికాబద్ధంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎలా చదవాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు తెలియజేసిన సూచనలు, సలహాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- త్వరలో పది, ఇంటర్ పరీక్షలు
- ఆందోళన వీడి.. స్వేచ్ఛగా ఆలోచించండి



సాక్షి, కడప డెస్క్ : పరీక్షలంటే శిక్ష కాదు. మీరు నేర్చుకున్న విషయాలను స్పష్టంగా, పూర్తిగా తెలియజేయడానికి ఒక అవకాశం. మీ స్థాయిని కొలిచే కొలబద్ద. ఉన్నత స్థితికి చేరడానికి నిరూపించుకునే ఒక వేదిక. చాలా మంది విద్యార్థులు కొన్ని ముఖ్యమైన ప్రశ్నల పట్టికను తయారు చేసుకుని, వాటిని మాత్రమే చదువుతూ ఉంటారు. కానీ ఒక్కొక్కసారి ఊహించని ప్రశ్నలు పరీక్షల్లో ఎదురవుతాయి. అప్పుడు మీ పరిస్థితి తారుమారవుతుంది. కాబట్టి అన్ని ప్రశ్నలను నేర్చుకోవడం చాలా అవసరం. ఎప్పుడైతే మీకు అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకుంటారో, ఆత్మవిశ్వాసం దానంతటదే మీ దరి చేరుతుంది. పరీక్ష హాల్లోకి ధైర్యంగా అడుగుపెట్టగలరు.

ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి కొన్ని జాగ్రత్తలు

- కష్టమైన పాఠాలను మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు నాలుగైదు సార్లు అయినా చదివి అర్థం చేసుకోవాలి.
- పరీక్షల్లో ప్రశ్నలు ఏ రకమైనవి అడుగుతారో అవగాహన కోసం మునుపటి ప్రశ్న పత్రాలను పరిశీలించాలి.
- జవాబులను సొంత మాటల్లో (పాఠంలో నివే సుమా) రాస్తే వేగం పెరుగుతుంది.
- అక్షరాలు స్పష్టంగా, గుండ్రంగా, అందంగా, పదాల మధ్య తగిన స్థలం ఉంచి రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. దిద్దేవారికి అర్థం కాకపోతే ఎంత కరెక్టుగా రాసినా మార్కులు తక్కువగానే వస్తాయి.
- ప్రశ్న పత్రంలోని ప్రశ్నలన్నీ చదివిన తరువాతే రాయటం మొదలుపెట్టాలి. అన్ని పాయింట్‌లు తప్పుల్లేకుండా రాయగలనని అనుకున్న ప్రశ్నలను మొదట రాసి, దిద్దేవారికి ఇది తెలివైన విద్యార్థి పేపరు అని అనుకునేలా చేస్తే.. తరువాత రాసే ప్రశ్నలకు కొద్దిగా సమాధానం తగ్గినా, మార్కులు ఎక్కువ పొందే అవకాశం ఉంది.
- జవాబులో ముందుగా ముఖ్యమైన పాయింట్లు రాయాలి. తరువాత మిగిలినవి రాయాలి.
- బాగా తెలుసు కదా.. అని చిన్న ప్రశ్నలకు ఎక్కువ రాయకూడదు. అలా చేస్తే చివరి ప్రశ్నలకు సమయం చాలదు. ఎంత రాసినా చిన్న ప్రశ్నలకు తక్కువ మార్కులే కదా వచ్చేది. అందుకని ముఖ్యమైన 8 లేదా 10 పాయింట్‌లు రాస్తే సరిపోతుంది. రాయాల్సిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. చివరి వాటికి కొన్ని పాయింట్లైనా రాస్తేనే కనీస మార్కులైనా వేస్తారు. ప్రయత్నించకపోవడం వల్లే తక్కువ మార్కులు వస్తాయి కాబట్టి బాగా, ఎక్కువగా రాయడానికి ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడే ఎక్కువ మార్కులు వస్తాయి.
- ప్రశ్నపత్రంలో ప్రశ్నకున్న నంబర్లను మాత్రమే రాయాలి. సొంత నంబర్లు వేయడం చాలా ప్రమాదం. అలా చేస్తే మార్కులు వేయరు.
- చివరి ఐదు నిముషాల్లో, చివర రాసిన సమాధానాల నుంచి మొదలు పెట్టి, మొదటి పేజీ వరకు రాసిన సమాధానాలన్నిటిని ఒకసారి చూసుకోవాలి. వేగంగా రాయడంలో వచ్చిన పొరపాట్లను సరి చేసుకోవడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది.
- అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు మర్చిపోకండి. స్కెచ్ పెన్నులు కూడా ఉపయోగించడం ద్వారా సమాధాన పత్రాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

పరీక్షా కేంద్రానికి ముందే చేరుకోండి

రోజూ అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవడం మంచిది. ఇన్విజిలేటర్‌తో తప్ప పరీక్ష హాల్‌లో విద్యార్థులు ఎవరితోనూ మాట్లాడవద్దు. ఒకటికి రెండు సార్లు హాల్‌టికెట్ నంబర్ సరిచూసుకోవాలి. తలపక్కకి తిప్పకుండా సమాధానాలు రాయడం మంచిది. టైం అయ్యే వరకు పరీక్ష హాల్ నుంచి బయటికి రాకపోవడం మంచిది.


పది సూత్రాలు

1 త్వరగా నిద్ర లేవండి



త్వరగా నిద్ర లేస్తే మీ చదువులో సక్సెస్ సాధించేందుకు సరైన అడుగు వేసినట్టే లెక్క. ఇందుకు అలారం పెట్టుకుని ప్రశాంతంగా నిద్రపోండి. సమయానికి లేచి ఉదయం పూట కాలకృత్యాలు తీర్చుకుని రంగంలోకి దూకండి.

2 ముందే ప్లాన్ చేసుకోండి



ఎగ్జామ్స్ కోసం చదవడం ప్రారంభించే ముందు కొన్ని నిమిషాలు మీరు ఆ రోజు ఏం చేయాలనుకుంటున్నారో ప్లాన్ చేయండి. చదువు, వ్యాయామం, ఇతర బాధ్యతలు అన్నీ ఈ ప్లాన్‌లో చేర్చండి. తద్వారా మీ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా జరిగిపోతాయి.

3 వ్యాయామం చేయండి



పరీక్షలు ఉన్నాయని వ్యాయామం చేయడం మానొద్దు. వ్యాయామం వల్ల శారీరకంగానే కాకుండా మీరు మానసికంగా స్ట్రాంగ్‌గా ఉంటారు. సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. కొద్దిసేపు నడక, లేదా యోగా కూడా మీ మనసును తేలికపరుస్తుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. చదువుకునేందుకు తగిన శక్తినిస్తుంది. ఏకాగ్రతకు వీలవుతుంది.

4 హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ అవసరం



పరీక్షల సమయంలో తప్పనిసరిగా ఉదయం పూట అల్పాహారం మంచి పోషకాలతో కూడినది తీసుకోవాలి. అది మీకు తగిన శక్తి నిస్తుంది. మీరు ఫోకస్ చేసేందుకు వీలవుతుంది.

5 విరామం అవసరం



మీ చదువు మీ మెదడుకు ఎక్కాలంటే మధ్య మధ్య బ్రేక్ కూడా తీసుకోవాలి. ఈ బ్రేక్స్ సమయంలో వీలైతే మ్యూజిక్ వినడమో, వ్యాయామం చేయడమో లేదా రిలాక్స్ అవడమో చేయండి.

6 ప్రాధాన్య క్రమం..



పరీక్షల సమయంలో అన్ని సబ్జెక్టులకు సమానంగా సమయం కేటాయించలేం. కొన్ని సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తుంది. అవి అర్థం చేసుకోవడంలో సవాలుతో కూడుకున్నవై ఉండొచ్చు. ఈ సబ్జెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడం, తగిన సమయం కేటాయించడం అవసరం.

7 ఉదయం పూట..



ఉదయం పూట మీ బ్రెయిన్ చాలా చురుగ్గా పని చేస్తుంది. సవాలుతో కూడుకున్న సబ్జెక్టులను మీ బ్రెయిన్ ఫ్రెష్‌గా ఉన్నప్పుడు ఉదయం పూటే రివిజన్ చేసుకోండి.

8 తగినంత నిద్ర..



పరీక్షల సమయంలో మీ బ్రెయిన్ సరిగ్గా తన విధులు నిర్వర్తించాలంటే నిద్ర చాలా అవసరం. రాత్రి కనీసం 8 గంటలు నిద్ర కోసం కేటాయించండి.

9 ప్రాక్టీస్ చేయండి



ప్రాక్టీస్ మేక్స్ పర్‌ఫెక్ట్ అన్న నానుడి తెలిసిందే కదా. పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా మీరు పరీక్ష రాయడంపై పట్టు సాధిస్తారు. ప్రశ్నావళి ఎలా ఉంటుందో మీకు అర్థం అవుతుంది. ఎలాంటి అప్రోచ్ అవసరమో కూడా తెలుస్తుంది.

10 కనెక్ట్ అయి ఉండండి



పరీక్షలనగానే స్నేహితులు, క్లాస్‌మేట్స్‌కు టాటా చెప్పేయకండి. వారితో పాటు టీచర్లు, కుటుంబ సభ్యులకు నిత్యం టచ్‌లో ఉంటే విలువైన సలహాలు, సపోర్ట్, ప్రోత్సాహం లభిస్తుంది. ఒత్తిడిని తగ్గించుకోవచ్చు.

ఆత్మవిశ్వాసంతో హాజరు కావాలి



పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలి. ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావడంతో పాటు తగినంత నిద్ర, వ్యాయామం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆత్మవిశ్వాసం ఆయుధంగా చేసుకుని పరీక్షలకు హాజరైతే విజయం సొంతమవుతుంది.

– డాక్టర్ కె. లలిత, సహ ఆచార్యులు, మనోవిజ్ఞానశాస్త్రశాఖ, వైవీయూ

భయం వద్దు.. ప్రశాంతత ముద్దు



పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నా.. విజేతలుగా నిలవాలన్నా ప్రణాళిక ఎంతో ముఖ్యం. ముందుగా విద్యార్థులు పరీక్షలు అంటే భయం వీడి, స్వేచ్ఛగా ఆలోచించి రాస్తే విజయం సులువు అవుతుంది. పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు వేకువజామున, ప్రశాంతంగా చదవడం అలవాటు చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా ప్రాధాన్యతా క్రమాన్ని ఎంపిక చేసుకుని ప్రిపేర్ అయితే మంచి మార్కులు సాధించవచ్చు.

– టి.రవిశంకర్‌రెడ్డి, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు, మున్సిపల్ హైస్కూల్, మెయిన్, కడప

ఐసీటీ అకాడమీ, ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం



ఒప్పందాలు కుదుర్చుకుంటున్న వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ఐసీటీ అకాడమి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి గుజ్జుల, ఐసీటీ అకాడమి రాష్ట్ర విభాధిపతి ఎస్.దినకర్ రెడ్డితో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ, నాంది ఫౌండేషన్ ద్వారా సుమారు 300 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ ఒప్పందం ద్వారా మరింత మంది విద్యార్థులకు ఉపయోగం ఉంటుందన్నారు. ఐసీటీ అకాడమి వారు విద్యార్థులకు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంలో తోడ్పడుతారన్నారు. విద్యార్థులకు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్, సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ రమణయ్య, సివిల్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ సి.జయచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలుపకడ్బందీగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఇంటర్ పబ్లిక్ పరీక్ష కేంద్రాల చీఫ్‌లు, డిపార్టెమెంట్ ఆఫీసర్లతో పరీక్షల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రాసే ఏ ఒక్క విద్యార్థి ఇబ్బందులకు గురి కాకూడదన్నారు. డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఇంటర్ బోర్డు ఆదేశానుసారం పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఈసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, శివహరిప్రసాద్‌రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అట్లూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సోమేశ్వపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు (60) తోపుడు బండి తోపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కడప–బద్వేలు కడప రహదారిలో రోడ్డు పక్కన బండి పెట్టుకొని వ్యాపారం చేస్తుండగా బద్వేలు వైపు నుంచి తిరుమలకు వెళ్తున్న ఏపీ 39 ఎఫ్ఎన్ 5691 నంబరు గల కారు అతి వేగంగా తోపుడు బండిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో సుబ్బరాయుడు తీవ్రంగా గాయపడ్డాడు.

పెన్నా నది నీటి గుంతలో వ్యక్తి మృతి

వల్లూరు : పుష్పగిరి వద్ద పెన్నా నదిలోని నీటి గుంతలో పడి చింతకొమ్మదిన్నె మండలం పోలుగారి పల్లెకు చెందిన చెన్నయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట రమణ తెలిపిన సమాచారం మేరకు బేల్దారి పని చేసి జీవించే చెన్నయ్య తోటి పనివారితో కలిసి మొత్తం తొమ్మిది మంది శుక్రవారం పుష్పగిరి సమీపంలో పెన్నా నదిలో డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారు. భోజనం అనంతరం చెన్నయ్య కనిపించకుండా పోయాడు. అతడు సమీపంలోని నీటి గుంత వైపు వెళ్లాడని, అందులో మునిగి వుంటాడని వారిలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. చెన్నయ్య భార్య గంగమ్మ తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం పుష్పగిరి చెన్న కేశవ స్వామి ఆలయానికి దిగువన కొంత దూరంలో పెన్నా నదిలో వున్న నీటి గుంతలో చెన్నయ్య మృతదేహం బయట పడింది. మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

గ్రూప్–2 పరీక్షకు పటిష్ట బందోబస్తు



ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : జిల్లాలో ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి ఒంటిగంట వరకు జరుగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్–2, స్క్రీనింగ్ టెస్ట్ రాత పరీక్షకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో 400 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఐదుగురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏ.ఎస్.ఐ/ హెచ్.సీలు, 160 మంది కానిస్టేబుళ్లు, 80 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్లు బందోబస్తు విధుల్లో వుంటారని తెలిపారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరులోని పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు 17 రూట్ మొబైల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

- జిల్లాలో మొత్తం 67 సెంటర్లలో 23,806 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. రాత పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు పరీక్షా కేంద్రం నుంచి అభ్యర్థులు బయటకు వెళ్లుటకు అనుమతించరన్నారు. ఇది గమనించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుని ముందుగా రావాలన్నారు. అభ్యర్థులు వెంట తెచ్చుకునే విలువైన సామాన్లు వారే సొంతంగా భద్రపరచుకోవాలన్నారు.
- రాత పరీక్ష రాసే అభ్యర్థులు హాల్‌టికెట్‌లో సూచించే నియమ నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచీలు, మొదలైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు పరీక్షా కేంద్రాలలోకి అనుమతించరన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసి వేయాలన్నారు. 144 సెక్షన్ అమల్లో వున్నందున, పరీక్షా కేంద్రాల వద్ద ప్రజలు గుమికూడడం నిషేధమన్నారు.
- పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు వున్నా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08562-246344కు కాల్ చేయాలనీ సూచించారు.

అభ్యర్థులకు ముఖ్య గమనిక:

- పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ఒరిజినల్ గవర్నమెంట్ అప్రూవ్ ఐడి కార్డ్‌తో మాత్రమే అనుమతిస్తారు.
- మంచినీటి సదుపాయం ఆయా పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేయడం జరిగింది.
- అభ్యర్థులు ఎలాంటి మాల్ ప్రాక్టీసెస్‌కి, చెడు ప్రవర్తనకు పాల్పడితే, ఏపీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్ అండ్ అన్ ఫెయిర్ మీన్స్) యాక్ట్ 1997 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్పీ వివరించారు.

ఆన్‌లైన్‌లో ఏపీటెట్ అభ్యర్థుల హాల్‌టికెట్లు

- టెట్ కోసం జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఈనెల 27 నుంచి ఆన్‌లైన్ పరీక్ష ప్రారంభం
- డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన ఏపీ టీచర్స్ ఎలిజిబిలిటి టెస్టు(ఏపీటెట్–2024) కంప్యూటర్ బేస్డ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వారి హాల్‌టికెట్లు హెచ్‌టిటిపిఎస్://ఏపీటెట్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఐన్ లో పొందగలరని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఈ టెట్ ఆన్‌లైన్ పరీక్ష కోసం జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏపీటెట్ కంప్యూటర్ బేస్డ్ టెస్టు ఫిబ్రవరి 27వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ వరకు రోజుకు రోజు రెండు సెషన్స్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు.

పరీక్షా కేంద్రాల వివరాలు ఇలా....

టీసీ కోడ్	పరీక్షా కేంద్రం	అడ్రసు
2033	కేఓఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల	పులివెందుల రోడ్డు క్రిష్ణాపురం, కడప
2043	కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల	పులివెందుల రోడ్డు క్రిష్ణాపురం, కడప
8938	వాగ్దేవి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	పెద్దశెట్టిపల్లె విలేజ్ ప్రొద్దుటూరు
1881	శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్	చెన్నై హైదరాబాదు రోడ్డు ఉక్కాయపల్లె, కడప
1915	శ్రీరాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	లింగాపురం ప్రొద్దుటూరు
1885	అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సు	ఆర్‌టీఓ ఆఫీస్ వెనుక ఊటుకూరు, కడప
3477	చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	విద్యానగర్, పల్లవోలు చాపాడు మండలం

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

బద్వేలు అర్బన్ : లంకమల అభయారణ్యంలో అక్రమంగా తరలిచేందుకు సిద్ధంగా ఉన్న 5 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని ఫారెస్టు రేంజ్ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో వాహనంతో పాటు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు బద్వేలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె.వెంకట శేషయ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లంకమల అభయారణ్యంలో ఎర్ర చందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీఎఫ్ఓ సందీప్‌రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు లోతువంక పరిధిలోని సారగొందిపాయ ప్రాంతంలో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించగా తమిళనాడు రాష్ట్రం తిరుపట్టూర్ ప్రాంతానికి చెందిన తమిళ్‌సెల్వన్ అనే వ్యక్తి దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగల విలువ సుమారు రూ.22 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎఫ్‌బీఓలు సుందరయ్య, సువర్ణకుమార్, రాజేష్‌రెడ్డి, ఏబీఓ షాజహాన్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న వెంకటశేషయ్య

రూ. 10 కోట్లకు
ఎగనామం

కడప అర్బన్ : వడ్డీ ఆశ చూపి.. కోట్లాది రూపాయలు వసూలు చేసి ఓ బియ్యం వ్యాపారి పరారయ్యాడు. నమ్మకమే పెట్టుబడిగా వ్యాపారం సాగిస్తూ.. బాధితులను నట్టేట ముంచాడు. దాదాపు రూ.10 కోట్లతో ఉడాయించాడు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, ప్రధాన హోదాల్లో ఉన్న వారికి సుపరిచితుడైన అతను అందరి దగ్గర డబ్బులు వసూలు చేస్తూ నమ్మకంగా మెలిగాడు. కొన్ని సంవత్సరాలుగా చిట్‌ఫండ్ నడిపేవాడు. ఆర్థికంగా చితికిపోయిన ఆ వ్యాపారి రాత్రికి రాత్రే కనిపించకుండా పోయాడు. అతని ఆచూకీ తెలియకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (సెల్ఫ్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835.

SERIVCES
BUSINESS OFFER
ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710

CHANGE OF NAME
I, BABANBHAIGARI MABU RASOOL S/o BABANBAHAIGARI FAKRUDDIN (OLD NAME) R/o D.NO.7/3648, SRINIVASA NAGAR, PRODDATUR, YSR Dist, A.P. HEREBY CHANGED MY & MY FATHER NAME AS BABANBHIGARI MABU RASOOL S/o BABANBHIGARI FAKRUDDIN (NEW NAME)
I, KOTHAPALLI MADDILETAIAH S/o SESHAIAH R/OF D.NO.6/35, BRAHMANA STREET, PORUMAMILLA (M & PO), PORUMAMILLA (MA), YSR KADAPA (D), A.P.516193. PERVISELLY MY DAUGHTER NAME AS PUJARI SRI BILVIKA (OLD NAME) NOW CHANGED MY DAUGHTER NAME AS KOTHAPALLI SRIBILVIKA (NEW NAME)

REALESTATE
TOLET
సింహపురి కాలని Opp.RTC బస్టాండ్, D.No.42/347-11 కడప టౌన్, 3 BHK,నార్త్ & ఈస్ట్ కార్నర్, కార్ పార్కింగ్ ఆఫీసులకు, ఫ్యామిలీస్‌కు. ✆ 9440046190, 9398439598.
హైదరాబాద్‌లో తూప్రాన్‌పేట్, గ్రీన్ సిటీలో తొర్రూర్, కోహెడ, జనచైతన్యలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ప్లాట్లు కొనబడును. సంప్ర: 8849688826 / 8848099912.

HEALTH CARE
NEURO
డా॥M.సుధాకర్‌రావు M.D(Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్లినిక్, రెడ్డి & రెడ్డి కాలని, తిరుపతి,0877-2250600, 9949916060.
NEURO
శ్రీశ న్యూరో కేర్: మెదడు, వెన్నుముక & నరముల వైద్య నిపుణులు డా.సి.శిరీషారాణి, Consultant Neurologist, DM (Neurology) M.D (General Medicine), MBBS University Topper, Gold Medalist పక్షవాతం, మూర్ఛ/ ఫిట్స్, మెడ నొప్పి, నడుమునొప్పి, తిమ్మిర్లు, మంటలు, నరముల సమస్య, కండరముల జబ్బులు, తలతిరగడం, మతిమరుపు, నిద్రసమస్యలు, సంపూర్ణ అవగాహనతో వ్యాధి నిర్ధారణ- అధునాతన చికిత్స మా ప్రత్యేకత. డో.నెం. 10-13-493,రెడ్డి&రెడ్డి కాలని,విజయ డయాగ్నస్టిక్ సెంటర్ వీధి, తిరుపతి, 8688663108.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

WANTED
అన్ని జిల్లాలో అంతటా మండలాల వారిగా ప్రభుత్వ సంస్థలలో అవుట్ సోర్సింగ్ జాబ్స్ కలవు, Q: SSC to Degree Sal 15000 to 28000. & 9440528878, 9440637647
కడప ఓల్డ్ రిమ్స్ దగ్గర శ్రీనివాస లాడ్జి నందు పని చేయుటకు మేనేజర్, బాయ్ కావలెను. సంప్ర : 9000383760
త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్. 9160900024 / 9640400073
ఉద్యోగాలు: YMC నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం కలదు. Q: 10, ఇంటర్, డిగ్రీ (P/F). Age: 18 to 30. నో ఫీజ్. సెల్. 9177342337.
గుంటూరు వద్ద అర్బన్ ఆఫీసులో ఉండి పని చేయుటకు అనుభవమున్న డ్రైవరు మరియు జూనియర్ లాయరు కావలెను. రూము సౌకర్యం+జీతం 20-25వేలు ✆ 8106719134 / 9346928964
ప్రొద్దుటూరులోని ఒక ప్రముఖ విద్యా సంస్థకు అర్హీ, బ్యాంకింగ్ అడ్మిషన్ల కొరకు PRO'S కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్ : 9032893075
కడప, కాగితాలపెంటలో గల స్టార్ ఎలక్ట్రికల్ నందు పనిచేయుటకు బాయ్స్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 9581028001
ప్రముఖ ప్రింటింగ్ ప్రెస్ నందు పని చేయుటకు కంప్యూటరు నందు అనుభవం కలిగిన అకౌంటెంట్ మరియు సూపర్ వైజర్ కావలెను. ఫోన్ : 8888111119,08562-222557
వనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర:: 9391912949, 040-40123376.
URGENT REQD - AREA SALES MANAGERS (50 positions), YAGILE SOFTWARE SOLUTIONS PH: 8639659091, 6303469359
క్యాషియర్స్ జెంట్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ జెంట్స్, హెల్పర్స్ కావలెను. ఇంటర్వ్యూ 26.02.2024 సోమవారం సం.ప్ర: డైరెక్షన్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కడప.

గమనిక